



# కెరటం న్యూస్

( సామాన్యుడి ఆయుధం )






Published from.. Hyderabad, Khammam, Warangal, Nalgonda

సంపుటి : 04 సంచిక :199 | మంగళవారం 22 జులై 2025 | ఎడిటర్ : వనం నాగయ్య | పేజీలు : 4 ఫోన్ : 9441877695




# త్వరలో ఆకస్మిక తనిఖీలు..

## ఏటీసీ రివ్యూలో సీఎం రేవంత్ రెడ్డి

●ఏటీసీలపై స్పెషల్ ఫోకస్: ఆకస్మిక తనిఖీలకు సిద్ధంగా ఉండాలన్న సీఎం రేవంత్ ● తెలంగాణ రైజింగ్-2047 లక్ష్యంగా అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్ల అభివృద్ధి వేగవంతం ● మూడు దశల్లో 111 ఏటీసీలు: ఫేజ్-1, 2లో ఇప్పటికే 49 సెంటర్లు అందుబాటులో ● జీనోమ్ వ్యాలీలో మోడల్ ఏటీసీ ఏర్పాటు ఆదేశించిన సీఎం రేవంత్ ● ఫార్మా, బయోటెక్, లైఫ్ సైన్సెస్ కోసం ప్రత్యేక శిక్షణ కోర్సులు ఏర్పాటు చేయాలి ● నైపుణ్యం గల నిర్మాణ సంస్థల సహకారంతో పనులు వేగవంతం చేయాలని సూచన ●గిగ్ వర్కర్లకు చట్టబద్ధ గుర్తింపు, సంక్షేమ బోర్డు ఏర్పాటు ప్రతిపాదన

**న్యూస్ డెస్క్, 21 జూలై (కెరటం న్యూస్):** తెలంగాణ రైజింగ్-2047పై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పెషల్ ఫోకస్ పెట్టారు. ఇందుకు అనుగుణంగా అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్స్ అభివృద్ధి, పురోగతిపై అధికారులతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సోమవారం కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులకు సీఎం కీలక ఆదేశాలు జారీ చేశారు. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా కోర్సులు, శిక్షణ అందించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఏటీసీల అభివృద్ధి, పనుల్లో పురోగతిపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. నిర్దేశిత సమయానికి అనుగుణంగా వీలైనంత త్వరగా ఏటీసీల అభివృద్ధి పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.

# సినీ తారలకి నోటీసులు జారీ చేసిన ఈడీ

## రానా, విజయ్,ప్రకాష్ రాజ్ , మంచులక్ష్మీలకు ఈడీ పిలుపు

**న్యూస్ డెస్క్, 21 జూలై (కెరటం న్యూస్):** ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌ల ప్రచారంతో సంబంధం ఉన్న కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) నలుగురు సినీ తారలకి నోటీసులు జారీ చేసింది. రానా దగ్గుబాటి, ప్రకాష్ రాజ్, విజయ్ దేవరకొండ, మంచు లక్ష్మీలను ఈ కేసులో విచారణ కోసం హాజరు కావాలని ఈడీ ఆదేశించింది.



# కోడెం దృతి శ్రీ భరతనాట్య ఆరంగేట్రం

## ఉత్తర కరోలినాలో ఘనంగా జరిగిన వేడుక



# ఎయిర్ ఇండియా ప్రమాద ఫైనల్ రిపోర్టు కోసం వెయిటింగ్

- కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు



**న్యూస్ డెస్క్, 21 జూలై (కెరటం న్యూస్):** అహ్మదాబాద్‌లో జరిగిన ఎయిర్ ఇండియా విమానం ఏఐ-171 ప్రమాదంపై దర్యాప్తు అంతర్జాతీయ ప్రోటోకాల్‌లకు అనుగుణంగా జరుగుతోందని కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు తెలిపారు.



# రాష్ట్రాన్ని అభివృద్ధి, సంక్షేమ బాటలో నడిపిస్తున్నాం..

●గోరి కొత్తపల్లిలో నూతన పోలీస్ స్టేషన్ ప్రారంభం ● చెల్పూర్‌లో రూ.5.50 కోట్లతో నూతన బస్టాండ్ నిర్మాణానికి శంకుస్థాపన ●ఆర్థిక ఇబ్బందుల మధ్య అభివృద్ధి, సంక్షేమ బాటలో రాష్ట్ర ప్రభుత్వం ● కోటిమంది మహిళలను కోటీశ్వరులను చేయాలనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లక్ష్యం ● ప్రభుత్వ సంక్షేమ హామీలు అమలు - మంత్రులు పొంగులేటి ,శ్రీధర్ బాబు

**న్యూస్ డెస్క్, 21 జూలై (కెరటం న్యూస్):** శాంతిభద్రతల పర్యవేక్షణ లో భాగంగా ప్రజారక్షణే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం లక్ష్యంగా పనిచేస్తుందని రాష్ట్ర రెవెన్యూ, సమాచార, పౌర సంబంధాలు, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, అసెంబ్లీ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు లు అన్నారు. సోమవారం గోరి కొత్తపల్లి మండలంలో నూతనంగా నిర్మితమైన పోలీస్ స్టేషన్‌ను భూపాలపల్లి శాసన సభ్యులు గండ్ర సత్యనారాయణ రావు, రాష్ట్ర ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ ఐత ప్రకాష్ రెడ్డి, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పీ కిరణ్ ఖరేలతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన సభలో మంత్రులు మాట్లాడుతూ సమాజంలో శాంతి భద్రతలు, చట్ట వ్యవస్థ పటిష్టంగా ఉండేలా పోలీస్ వ్యవస్థను బలోపేతం చేయడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు.

# కోమటిరెడ్డికి అసలు విషయం తెలియదు..

## కాంగ్రెస్ క్షమశిక్షణ కమిటీ చైర్మన్, ఎంపీ మల్లు రవి



**న్యూస్ డెస్క్, 21 జూలై (కెరటం న్యూస్):** తెలంగాణ కాంగ్రెస్ సీనియర్ నేత, మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి పై కాంగ్రెస్ క్షమశిక్షణ కమిటీ చైర్మన్, ఎంపీ మల్లు రవి షాకింగ్ కామెంట్స్ చేశారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. సీఎం రేవంత్ రెడ్డిపై రాజగోపాల్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను అధిష్టానం చూసుకుంటుందని అన్నారు. పార్టీ విషయాలు బహిరంగంగా మాట్లాడొద్దు అని హితవు పలికారు. పదేళ్లు సీఎంగా ఉంటాననే రేవంత్ రెడ్డి వ్యాఖ్యలపై కాంగ్రెస్ నేతలు సంయమనంతో ఉండాలని కోరారు. తాను పదేళ్లుగా ముఖ్యమంత్రిగా ఉంటానని రేవంత్ రెడ్డి ఏ సందర్భంలో అన్నాడో రాజగోపాల్ రెడ్డికి తెలియదని అన్నారు. సీఎంపై కేటీఆర్ ఇష్టానుసారం మాట్లాడుతున్నారు.. దానిని కాంగ్రెస్ శ్రేణులు తిప్పికొట్టాలని సూచించారు.

# హెచ్‌సీఏ స్కామ్‌పై సీఐడీ విచారణలో వెలుగులోకి సంచలనాలు!



**న్యూస్ డెస్క్, 21 జూలై (కెరటం న్యూస్):** హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) స్కామ్‌పై తెలంగాణ నేర పరిశోధన విభాగం (సీఐడీ) విచారణ కొనసాగుతోన్న విషయం తెలిసిందే. సీఐడీ కార్యాలయంలో హెచ్‌సీఏ నిందితుల విచారణ కొనసాగుతోంది. ఐదవ రోజు ఐదుగురు నిందితులను సీఐడీ అధికారులు విచారిస్తున్నారు. ఈ విచారణలో సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. హెచ్‌సీఏ ప్రెసిడెంట్‌గా జగన్మోహన్ రావు దొడ్డిదారిన ఎన్నికైనట్లు సీఐడీ గుర్తించింది.



# స్థానిక ఎన్నికల్లో గులాబీ జెండా ఎగురుతుంది

●కాంగ్రెస్ పాలనలో భూముల ధరలు తగ్గిపోయాయి
●రుణమాఫీ చేసింది 30 పైసలు, ఎగ్గొట్టింది 70 పైసలు
●రైతులకు రేవంత్ ప్రభుత్వం అన్యాయం
●కాళేశ్వరం నీళ్లు విడుదలపై స్పష్టత ఇవ్వాలి
●రెండు నెలల పెన్షన్‌లు ఎగ్గొట్టిన ప్రభుత్వం ఎలా న్యాయం చేస్తుంది?: హరీష్ రావు

**న్యూస్ డెస్క్, 21 జూలై (కెరటం న్యూస్): స్థానిక ఎన్నికల్లో గులాబీ జెండా ఎగురవేస్తామని మాజీమంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు మా వ్యక్తం చేశారు. స్థానిక ఎన్నికలపై ఈ మధ్య సర్వే చేయిస్తే.. తెలంగాణలో మొత్తం 31 జిల్లా పరిషత్‌లు ఉంటే.. 16 నుంచి 18 స్థానాలని బీఆర్‌ఎస్ కైవసం చేసుకోబోతోందని ఆ సర్వేలో తేలిందని తెలిపారు.**

స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్‌ని ఓడించాలని పిలుపునిచ్చారు. సోమవారం ప్రజ్ఞాపూర్‌లో గజ్వేల్ నియోజకవర్గ బీఆర్ఎస్ ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో హరీష్‌రావు పాల్గొని బీఆర్ఎస్ శ్రేణులకి దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో ఎమ్మెల్సీ యాదవరెడ్డి, మాజీ ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా హరీష్‌రావు మీడియాతో మాట్లాడారు. అభివృద్ధికి కేరాఫ్ అడ్రస్ గజ్వేల్ అని ఉద్ఘాటించారు.

రేవంత్ ప్రభుత్వం అన్నదాతలని ఇబ్బందులకు గురిచేస్తోందని మాజీమంత్రి హరీష్‌రావు విమర్శించారు. బీఆర్ఎస్ హయాంలో రైతులు ఎరువులకు లైన్‌లో నిలబడ్డ దాఖలాలు లేవని.. రేవంత్ ప్రభుత్వంలో ఇప్పుడు ఎకరానికి ఒకటే బ్యాగ్ అంటున్నారని... మళ్లీ లైన్లలో నిలబడే పరిస్థితి తీసుకువచ్చారని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం అందరూ రైతులకు రైతుబంధు ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. మల్లన్నసాగర్‌లోకి కాళేశ్వరం నీళ్లు ఎందుకు విడుదల చేయడం లేదని నిలదీశారు. కేసీఆర్ హయాంలో మోటార్లు కాలకపోయేవని.. ఇప్పుడు మోటార్ వెండింగ్ దుకాణాలకు గిరాకీ పెరిగిందని విమర్శించారు. ఆనాడు తెలంగాణలో ఒక ఎకరం అమ్మితే ఆంధ్రాలో పది ఎకరాలు భూమి కొనవచ్చని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారని గుర్తుచేశారు. ఇప్పుడు రేవంత్ పాలనలో తెలంగాణలో రెండు ఎకరాలు అమ్మితే ఆంధ్రాలో ఒక ఎకరం కొనే పరిస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు .

# కుల వృత్తులను నాశనం చేయాలని చూస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం

## : మాజీ మంత్రి వి.శ్రీనివాస్ గౌడ్



●గీత కార్మికులను కనీసం గుర్తించని ప్రభుత్వం: లిక్కర్ మాఫియాకు తలొగ్గుతోందన్న ఆరోపణ ● ఓఆర్ఆర్ లోపల కల్లు నిషేధానికి కుట్ర, ●లిక్కర్ కంపెనీలకు లాభం కోసం కుట్ర అంటూ విమర్శ కల్తీ కల్లును ప్రోత్సహిస్తున్న రాజకీయ నేతల పేర్లు బయటపెడతామని హెచ్చరిక ●మళ్లీ కేసీఆర్ సీఎం కాగానే కల్లు దుకాణాలను తెరిపిస్తాం

# ఆర్టీఐలో బీసీలు ఎస్సిలకు చోటు లేదా .?



**న్యూస్ డెస్క్, 21 జూలై (కెరటం న్యూస్):** ఇటీవల కాలంలో తెలంగాణ జాగృతి తరపున ఎమ్మెల్సీ కవిత కీలక పోరాటాలు చేస్తూ తరచూ వార్తల్లో నిలుస్తున్నారు. అధికార కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలతో పాటు సొంతపార్టీ బీఆర్ఎస్ తీరుగా బహిరంగంగా ఎండగడుతున్నారు. తాజాగా ఎక్స్ వేదికగా సమాచార హక్కు చట్టం కమిషన్ లో కమిషనర్ల నియాకంలో ప్రభుత్వ వైఖరిని విమర్శిస్తూ విమర్శల బాణం ఎక్కుపెట్టారు. సమాచార హక్కు చట్టం కమిషన్‌లో బీసీలు, ఎస్టీలకు చోటు ఇవ్వరా అని ప్రశ్నిస్తూ ట్వీట్ చేశారు.

# త్వరలో ఆకస్మిక తనిఖీలు.. ఏటీసీ రివ్యూలో సీఎం రేవంత్ రెడ్డి

**న్యూస్ డెస్క్, 21 జూలై (కెరటం న్యూస్):** ఏటీసీల అభివృద్ధి, పురోగతిపై ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తానని సీఎం చెప్పుకొచ్చారు. తెలంగాణ రాష్ట్రంలో మూడు దశల్లో 111 ఏటీసీలను అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు అధికారులు. ఫేజ్-1లో 25, ఫేజ్-2లో 40, ఫేజ్-3లో 46 ఏటీసీలని అభివృద్ధి చేయనున్నట్లు వివరించారు. ఫేజ్-1, ఫేజ్-2లో ఇప్పటి వరకు 49 ఏటీసీలు అందుబాటులోకి వచ్చాయని వెల్లడించారు అధికారులు. ఏటీసీలను వీలైనంత త్వరగా పూర్తి చేసేందుకు అవసరమైతే నైపుణ్యం కలిగిన నిర్మాణ సంస్థల సహకారం తీసుకోవాలని సూచించారు సీఎం రేవంత్‌రెడ్డి. జీనోమ్ వ్యాలీలో ఒక మోడల్ ఏటీసీని ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు ముఖ్యమంత్రి. ఫార్మా, బయోటెక్నాలజీ, లైఫ్ సైన్సెస్ పరిశ్రమలకు అవసరమైన శిక్షణ అందించే కోర్సులు అక్కడ నిర్వహించాలని సూచించారు. అవసరమైన స్థలం కేటాయింపుతో పాటు అధునాతన సెంటర్ ఏర్పాటుకు ప్రతిపాదనలు తయారు చేయాలని అధికారులకు సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు.

గిగ్ వర్కర్స్ పాలసీపై సమీక్ష

గిగ్ వర్కర్స్ పాలసీపై సీఎం రేవంత్‌రెడ్డి సమీక్షించారు. గిగ్ కార్మికులకు ప్రతిపాదిత పాలసీని సమీక్షలో ముఖ్యమంత్రికి వివరించారు అధికారులు. గిగ్ వర్కర్స్‌కు చట్టబద్ధమైన గుర్తింపు అంశాన్ని పాలసీలో ప్రతిపాదించారు అధికారులు. సంక్షేమబోర్డు ఏర్పాటు చేసి రాష్ట్ర ప్రభుత్వం ప్రాతినిధ్యం వహించేలా ప్రతిపాదనలు చేశారు. గిగ్ కార్మికుల పాలసీపై అధికారులకు పలు సూచనలు చేశారు సీఎం రేవంత్‌రెడ్డి. గిగ్ కార్మికులకు సంబంధించిన పూర్తి డేటా ఆన్‌లైన్‌లో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు ముఖ్యమంత్రి. సంక్షేమ నిధి ఏర్పాటు చేయడంతో పాటు గిగ్ వర్కర్లకు ప్రమాద బీమా, హెల్త్ ఇన్సరెన్స్ సౌకర్యాలను కల్పించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సూచించారు.

# కోమటిరెడ్డికి అసలు విషయం తెలియదు..

**న్యూస్ డెస్క్, 21 జూలై (కెరటం న్యూస్):** కాగా, ముఖ్యమంత్రిగా మరో పదేళ్లు తానే ఉంటానని రేవంత్ రెడ్డి చేసిన ప్రకటన రాజకీయ దుమారం రేపిన విషయం తెలిసిందే. ఈ వ్యాఖ్యలపై కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి తీవ్రంగా స్పందించారు. రేవంత్ ప్రకటన కాంగ్రెస్ విధానాలకు విరుద్ధమని ఆయన పేర్కొన్నారు. వ్యక్తిగత సామ్రాజ్యంగా మార్చుకునే ప్రయత్నాలను కాంగ్రెస్ కార్యకర్తలు సహించరని రాజగోపాల్ రెడ్డి ట్విట్టర్ వేదికగా విమర్శించారు. ఈ వ్యాఖ్యలు కాంగ్రెస్ పార్టీలో అసమ్మతికి దారితీస్తున్నాయి. ఇప్పటికే కోమటిరెడ్డి వ్యాఖ్యలపై పలువురు నేతలు స్పందించి కౌంటర్ ఇవ్వగా, తాజాగా మల్లు రవి స్పందించడం హాట్ టాపిక్‌గా మారింది.

# కోడెం దృతి శ్రీ భరతనాట్య ఆరంగేట్రం



**ఖమ్మం బ్యూరో,21 జూలై (కెరటం న్యూస్):** భరతీయ సాంస్కృతిక సంపదను సజీవంగా ఉంచే ప్రయత్నంలో మరో వెలకట్టలేని ఘట్టం ఏర్పడింది. కోడెం దృతి శ్రీ, తల్లిదండ్రులు శ్రీ కోడెం మేఘనాథ్, సంధ్యా కుమార్తె, 20 జూలై 2025 న నార్త్ కరోలినాలో తన భరతనాట్య ఆరంగేట్రాన్ని ఘనంగా నిర్వహించింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డా. జి. వెంకటేశ్వర్లు, తెలంగాణ రాష్ట్ర బీజేపీ కౌన్సిల్ మెంబర్, మరియు శ్రీరక్ష హాస్పిటల్ వ్యవస్థాపకులు, హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ... "విదేశాల్లో జీవిస్తూ కూడా మన సంప్రదాయాన్ని కాపాడటానికి ఈ తల్లిదండ్రుల కృషి అభినందనీయం. కోడెం దృతి శ్రీ ఆరంగేట్రం అనేది కళా పరంగా కాదు %-% భారతీయతకు ఓ అంకితం." అని ప్రశంసించారు. గురువర్యులు ప్రదర్శనకు శిక్షణనిచ్చి, తల్లిదండ్రులు ఎంతో నమ్మకంతో, శ్రద్ధతో సన్నద్ధం చేసిన ఈ నాట్య ప్రదర్శన, భారతీయ భక్తి, భావం, తాళం, నాట్య శాస్త్రాలను ప్రతిబింబిస్తూ ప్రేక్షకులను అలరించింది.



అమెరికాలో స్థిరపడిన కుటుంబం అయినప్పటికీ, భారతీయతను మరవకుండా, తమ కుమార్తెకు శాస్త్రీయ నాట్యాన్ని నేర్పించడం ద్వారా మన సంస్కృతి భవిష్యత్ తరాలకు ఎలా అందించాలో చక్కటి ఉదాహరణగా నిలిచారు. ఈ సందర్భంగా డా. జి. వెంకటేశ్వర్లు గారు దృతి శ్రీకు ఆశీర్వచనాలు తెలియజేస్తూ, "మన సంస్కృతిని కాపాడటమే నిజమైన దేశభక్తి" అని పేర్కొన్నారు.

# కుల వృత్తులను నాశనం చేయాలని చూస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం : మాజీ మంత్రి వి.శ్రీనివాస్ గౌడ్

**న్యూస్ డెస్క్, 21 జూలై (కెరటం న్యూస్):** కుల వృత్తులను కాపాడుతామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పుడు వాటిని నాశనం చేయాలని చూస్తుందని మాజీ మంత్రి వి.శ్రీనివాస్ గౌడ్ అన్నారు. ఏ కుల వృత్తిపై ప్రభుత్వం దృష్టి సారించడం లేదన్నారు. సోమవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో మీడియాతో ఆయన మాట్లాడారు. ఆదాయం వచ్చే కుల వృత్తులను ప్రభుత్వం నాశనం చేయాలని చూస్తోందన్నారు. గీత కార్మికులకు ఐదు ఎకరాల పొలం ఇస్తామని చెప్పారు. గీత కార్మికులు చెట్లపై నుంచి పడి చనిపోతే రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇస్తామని ప్రభుత్వం చెప్పింది. లిక్కర్ మాఫియాకు తలొగ్గి కల్లుగీత వృత్తిని బంద్ చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వం భావిస్తోంది. కల్లు కంపౌండ్ ద్వారా పది కులాలు బ్రతుకుతున్నాయి. ఉప్పల్‌లో తాటి చెట్లు కొట్టి గీత కార్మికులకు నష్టం చేశారు.

ఓఆర్‌ఆర్ లోపల కల్లు నిషేదానికి కుట్ర

కల్లు కంపౌండ్‌ను నిషేధిస్తామని ప్రభుత్వం లీకులు ఇస్తోంది. లిక్కర్ కంపెనీలు, డిస్టలరీలన్నీ ఒకరిద్దరి చేతుల్లో నడుస్తున్నాయి. లిక్కర్ కంపెనీల కమీషన్లకు కక్కుర్తిపడి, లిక్కర్ మాఫియాకు తలొగ్గి కల్లు కాంపౌండ్ బంద్ చేయాలని చూస్తున్నారు. కల్లులో మీరే ఏదో కలిపి కుట్ర చేస్తూ ఓఆర్‌ఆర్ లోపల కల్లుపై నిషేధం విధించాలని చూస్తున్నారు. ఎన్టీఆర్ మధ్య నిషేధం సమయంలోనూ కల్లును నిషేధించలేదు. కల్లు, నీరాకు ఔషధ గుణాలు ఉంటాయి. నీరాను ప్రైవేటు వాళ్లకు అప్పగించారు. కుల వృత్తిని అవమానించే విధంగా ప్రభుత్వం వ్యవహరిస్తోంది. రాష్ట్రంలో డ్రగ్స్, గంజాయిని నిషేధించడంలో ప్రభుత్వం ఎందుకు విఫలం అవుతుంది. కల్తీ పాలు అరికట్టడంపై ప్రభుత్వం ఎందుకు దృష్టి పెట్టడం లేదు. రాష్ట్రంలో విచ్చలవిడిగా ఫార్మా కంపెనీలకు పర్మిషన్లు ఇస్తున్నారు. ఇతర రాష్ట్రాల్లో నిషేధించిన బీర్లను తెలంగాణలో అమ్ముతున్నారు.

కల్లు కంపౌండ్ బంద్ చేస్తే ప్రభుత్వాన్ని నడవనీయం

నియోజకవర్గంలో ఒక్కో ఎమ్మెల్యేకు 10 నుంచి 15 లక్షలు ఇస్తున్నారు. దాదాపు 35 మంది ఎమ్మెల్యేలు నెలవారీ డబ్బులు తీసుకుంటున్నారు. కల్తీ కల్లును ప్రోత్సహిస్తున్నది ఎవరనేది ప్రభుత్వం తేల్చాలి. గీత సంఘాల నుంచి ఎమ్మెల్యేలు డబ్బులు తీసుకుంటూ కల్తీ కల్లును ప్రోత్సహిస్తున్నారా? బిఆర్ఎస్ హయాంలో జిల్లాకో నీరా కేంద్రం పెట్టాలని భావించాం. హైదరాబాద్ నగర నడిబొడ్డున నీరా కేఫ్ పెట్టి కులవృత్తిని కాపాడాం. కల్లు కంపౌండ్ దమ్ముంటే బంద్ చేసి చూడండి. కల్లు కంపౌండ్ బంద్ చేస్తే ప్రభుత్వాన్ని నడవనీయం. మళ్లీ కేసీఆర్ సీఎం కాగానే కల్లు దుకాణాలను తెరిపిస్తాం. వైన్ షాపులు కల్లుగీత కార్మికుల కుటుంబాలకు ఇస్తాం.

నిజామాబాద్‌లో గౌడ కులస్తులపై నిషేధం

నిజామాబాద్ జిల్లాలో గౌడ కులస్తులపై నిషేధం విధించారు. 60 మంది గౌడ కుల స్త్రీలు గుడికి వెళ్తే గుళ్లోకి రావద్దని వెనక్కి పంపారు. లక్షలు, లక్షలు మామూళ్లు తీసుకుని కల్లు దుకాణాలు బంద్ చేస్తామంటే చూస్తూ ఊరుకోం. కల్లు దుకాణాలు బంద్ పెడితే బల్కంపేట ఎల్లమ్మ తల్లి ఆలయం వద్ద మామూళ్లు తీసుకుంటున్న ఎమ్మెల్యేల పేర్లు బయటపెడతాం. హైదరాబాద్ నగర శివారు ప్రాంతంలో గీత చెట్లు ఉన్నాయి. కల్లు కంపౌండ్ పేదోళ్లకు రిక్రియేషన్ సెంటర్ లాగా ఉంటుంది. తాము అధికారంలోకి వచ్చాక లిక్కర్ మాఫియా నుంచి, కల్లు కంపౌండ్ నుంచి డబ్బులు వసూలు చేసిన వారిపై చర్యలు తీసుకుంటామని శ్రీనివాస్ గౌడ్ హెచ్చరించారు. అలాగే తాటి చెట్లు నరికిన వారిపై కేసులు పెట్టాల్సిందిగా ఆయన డిమాండ్ చేశారు.

# స్థానిక ఎన్నికల్లో గులాబీ జెండా ఎగురుతుంది

మొదటి పేజీ తరువాయి

20 నెలల కాంగ్రెస్ పరిపాలనలో తెలంగాణ పరిస్థితి ఏవిధంగా ఉందో ప్రజలకు తెలియజెప్పాల్సిన బాధ్యత తమపై ఉందని చెప్పుకొచ్చారు. ఊర్లలో చెత్త ఎత్తే పరిస్థితి కనపడడం లేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మొదటి ఏడాదిలో 2 లక్షల ఉద్యోగాలు ఇస్తామని చెప్పారని.. కానీ 12 వేల ఉద్యోగాలు ఇచ్చి మోసం చేశారని ధ్వజమెత్తారు. బీఆర్ఎస్ హయాంలో లక్ష అరవై వేల ఉద్యోగాలు ఇచ్చామని ఉద్ఘాటించారు. నిరుద్యోగులు ఎక్కడ ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తారోనని వందలాది మంది పోలీసులతో తిరుగుతున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో 4 వేల పెన్షన్‌లు ఇస్తామని చెప్పి.. 2 లక్షల పెన్షన్ లు తీసేశారని మండిపడ్డారు. కొత్త పెన్షన్ ఒక్కరికి కూడా ఇవ్వలేదని ఫైర్ అయ్యారు. ఇరవై నెలల్లో 2 నెలల పెన్షన్‌లు ఎగ్గొట్టారని హరీష్‌రావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

బిఆర్ఎస్ హయాంలో వేసవిలోనూ పంటల సాగుకు తగినంత నీరు ఇచ్చామని మాజీ మంత్రి, ఆ పార్టీ ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. గతంలో హల్దీ వాగులో లిఫ్ట్ పెట్టి గద్దర్ వాళ్ల ఊరికి నీళ్లు వచ్చేలా చేశామని చెప్పారు. కేసీఆర్ పాలనను గద్దర్ కూడా మెచ్చుకున్నారని పేర్కొన్నారు

కాంగ్రెస్ పాలనలో భూముల ధరలు తగ్గిపోయాయని చెప్పారు. యాసంగికి సంబంధించి సన్న వడ్లకు బోనస్ రాలేదని విమర్శించారు. రుణమాఫీ చేసింది 30 పైసలు, ఎగ్గొట్టింది 70 పైసలు అని ఎద్దేవా చేశారు. తమ పార్టీ నేతలు, కార్యకర్తలపై అక్రమంగా కేసులు పెడుతున్నారని హరీశ్‌రావు దుయ్యబట్టారు.

# రాష్ట్రాన్ని అభివృద్ధి, సంక్షేమ బాటలో నడిపిస్తున్నాం..

మొదటి పేజీ తరువాయి

ప్రజలకు మరింత మెరుగైన సేవలందించేందుకు గోరి కొత్తపల్లిలో నూతన పోలీస్ స్టేషన్ ఏర్పాటైనందుకు హర్షం వ్యక్తం చేశారు. ఇది స్థానిక ప్రజలకు రక్షణకు భాసటగా నిలుస్తుందని వారు తెలిపారు. అదేవిధంగా గణపురం మండలం చెల్పూర్ లో రూ.5.50 కోట్లు కేటి పిపి సిఎస్ఆర్ నిధులతో నిర్మించనున్న నూతన బస్టాండ్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు.

అనంతరం వారు మాట్లాడుతూ ఆర్థిక ఇబ్బందులు ఉన్నా అభివృద్ధి సంక్షేమంగా పనిచేస్తున్నామని కొనియాడుతూ ఈ ప్రజా ప్రభుత్వం కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలనేది ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కోరిక అని, మహిళలకు మహిళా శక్తి కార్యక్రమం ఏర్పాటు చేసి ఆర్ టి సి బస్సులు, పెట్రోల్ బంక్ లు , సోలార్ పవర్ కేంద్రాలు, ధాన్యం సేకరణ కేంద్రాలు, మహిళా క్యాంటీన్లు, అమ్మ ఆదర్శ పాఠశాలలు లాంటి కార్యక్రమాలు ఆడబిడ్డలను ముందు పెట్టి అనేక సంక్షేమ కార్యక్రమాలు చేస్తున్నామని తెలిపారు.



గత ప్రభుత్వం చేసిన 8 లక్షల కోట్ల రూపాయల అప్పు ఉన్న 10 నెలలో రూ.21 వేల కోట్లు రుణమాఫీ చేశామని, రైతు భరోసా 9 రోజుల్లో రూ.9 వేల కోట్లు రైతుల ఖాతాలో జమ చేశామని తెలిపారు. 200 యూనిట్ల ఉచిత విద్యుత్ సరఫరా చేస్తున్నామని, రూ. 500లకె గ్యాస్ సిలిండర్, పేదలకు మెరుగైన వైద్యసేవలకు రూ. 10 లక్షలు ఆరోగ్య శ్రీ ఇస్తున్నామని, 5 లక్షల కొత్త రేషన్ కార్డు లతో పాటు 16 లక్షల కొత్త పేర్లను పాత కార్డులలో నమోదు చేశామని తెలిపారు.

ఇందిరమ్మ ఇళ్లు రాష్ట్ర వ్యాప్తంగా 3.50 లక్షలు ఇస్తున్నామని, భూపాలపల్లి నియోజకవర్గంలో మొదటి విడతలో 35 వందల ఇళ్లు మంజూరు చేశామని, రాబోయే రోజుల్లో అదనంగా 15 వందల ఇళ్లు ఇస్తామని ప్రకటించారు. అర్హులైన ప్రతి పేదవాడికి విడతల వారీగా ఇందిరమ్మ ఇళ్లు ఇస్తు ప్రతి సోమవారం ఇందిరమ్మ ఇళ్లకు డబ్బులు లబ్ధిదారుల ఖాతాలో జమ చేస్తున్నామని అన్నారు. ఇంకా రాబోయే రోజుల్లో ఇచ్చిన అన్ని హామీలను నెరవేరుస్తామని స్పష్టం చేశారు. సంవత్సరం కాలం నుండి అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను రెండు కళ్ళుగా భావించి నడిపిస్తున్నామని రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తెలిపారు. పేద విద్యార్థుల విద్యకు రూ. 200 కోట్లతో ఇంటిగ్రేటెడ్ పాఠశాల నిర్మాణం చేపట్టనున్నట్లు,గణపురంలో 60 ఎకరాలలో పారిశ్రామిక పార్కు ఏర్పాటు చేశామని మహిళలకు మినీ ఇండస్ట్రీస్ ఏర్పాటు చేయడం కొరకు 20 ఎకరాల స్థలం కేటాయించినట్లు తెలిపారు.

ప్రభుత్వం పరిశ్రమలు ఏర్పాటుకు సబ్సిడీ ఇస్తుందని సద్వినియోగం చేసుకుని వ్యాపారవేత్తలుగా ఎదగాలని సూచించారు. అనంతరం జిల్లా కేంద్రంలో (టీ ఏ ఎస్ కే) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వృత్తి శిక్షణా కేంద్రాన్ని ఐటీ శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు, పొంగిలేటి శ్రీనివాస్ రెడ్డి జిల్లా అధికారులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ యువతకు ఉపాధి కల్పనకు కృషి చేస్తున్నామని డిగ్రీ, పీజీ, ఇంజినీరింగ్, ఎంబీఏ తదితర ఉన్నత విద్యనభ్యసించిన నిరుద్యోగ యువతకు స్కిల్ శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. జయశంకర్ జిల్లా యువత ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచిస్తూ నైపుణ్యం కలిగిన యువతకు బహుళ జాతి సంస్థలు ప్రాధాన్యత ఇస్తున్నాయని, టాస్క్ ద్వారా 50 పరిశ్రమలతో భాగస్వామ్యం ద్వారా ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నట్లు ఆయన వివరించారు.

శిక్షణ పొందిన అభ్యర్థులకు సింగరేణి, విద్యుత్ సంస్థల్లో ఉద్యోగ అవకాశాలు లభిస్తున్నాయని పేర్కొన్నారు. ముందు జిల్లా కేంద్రంలోని భాస్కర గడ్డలో రెండు పడక గదుల ఇళ్ళు మంజూరైన లబ్ధిదారులకు నూతన బట్టలు పెట్టి శుభాకాంక్షలు తెలిపారు. అన్ని సౌకర్యాలు కల్పిస్తామని స్పష్టం చేశారు.అనంతరం జిల్లా కేంద్రంలో రూ. కోటి నిధుల వ్యయంతో నిర్మించిన నూతన గ్రంథాలయాన్ని ప్రారంభిస్తూ చైర్మన్గా మహాదేవపూర్ మాజీ సర్పంచ్ కోటా రాజబాబుకు బాధ్యతలు అప్పగించారు. ఈ కార్యక్రమంలల్లో అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, ఆర్టీసీ ఏడ్ సలొమం, ఆర్ఎం విజయ భాను, డిఎం ఇందు, టాస్క్ సీఈవో శ్రీకాంత్, సింగరేణి జిఎం రాజేశ్వర్ రెడ్డి లతోపాటు వివిధ శాఖల అధికారులు, మహిళా సంఘాలు, ప్రజలు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

# మతపరమైన రిజర్వేషన్లకు బీజేపీ వ్యతిరేకం : ఎన్. రాంచందర్ రావు



**న్యూస్ డెస్క్, 21 జూలై (కెరటం న్యూస్):** తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు ఢిల్లీలో పర్యటిస్తున్నారు. ఈ నేపథ్యంలో రేపు బీజేపీ జాతీయ అధ్యక్షుడు జె.పి. నడ్డా, కేంద్ర హోంమంత్రి అమిత్ షాలను కలవనున్నారు. తెలంగాణలో రాజకీయ వ్యూహాలు, స్థానిక ఎన్నికల సన్నాహాలు, పార్టీ బలోపేతంపై చర్చించనున్నారు. మతపరమైన రిజర్వేషన్లను బీజేపీ గట్టిగా వ్యతిరేకిస్తుందని మరోసారి స్పష్టం చేసారు. బీసీలకు 42% రిజర్వేషన్లను సమర్థిస్తుందని, కానీ కాంగ్రెస్ ప్రభుత్వం ఆ బిల్లులో ముస్లిం రిజర్వేషన్లను చేర్చి ఓబీసీ సమాజాన్ని తప్పుదోవ పట్టిస్తోందని విమర్శించారు. బీజేపీ మాత్రమే బీసీలకు న్యాయం చేయగలదని, మతపరమైన రిజర్వేషన్లు లేకుండా రిజర్వేషన్లు కల్పించాలని నొక్కిచెప్పారు.

ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వం, బీజేపీ హైకమాండ్ సానుకూలంగా స్పందిస్తాయని ధీమా వ్యక్తం చేసారు. తెలంగాణలో బీసీలకు న్యాయం చేయడానికి పార్టీ కృషి చేస్తుందని ఆయన హామీ ఇచ్చారు. మరోవైపు పార్టీలో అంతర్గత పోరుపై రాంచందర్ రావు స్పందించారు. తమ అంతర్గత వ్యవహారాలు తామే పరిష్కరించుకుంటామని తెలిపారు. కేటీఆర్-కవిత, రేవంత్-కోమటిరెడ్డి మధ్య కూడా అంతర్గత విభేదాలు ఉన్నాయని అన్నారు. పార్టీ కంటే ఎవరు ఎక్కువ కాదని, హద్దు దాటితే చర్యలు తప్పవు అని పేర్కొన్నారు.

# ఎయిర్ ఇండియా ప్రమాద ఫైనల్ రిపోర్టు కోసం వెయిటింగ్ - కేంద్ర మంత్రి రామ్మోహన్



**న్యూస్ డెస్క్, 21 జూలై (కెరటం న్యూస్):** అహ్మదాబాద్‌లో జరిగిన ఎయిర్ ఇండియా విమానం ఏఐ-171 ప్రమాదంపై దర్యాప్తు అంతర్జాతీయ ప్రోటోకాల్‌లకు అనుగుణంగా జరుగుతోందని కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు తెలిపారు. ఈ దర్యాప్తును ఎయిర్‌క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బోర్డ్ నిర్వహిస్తోందన్నారు. ప్రమాదం ఎలా, ఎందుకు జరిగిందనే దానిపై సమగ్ర దర్యాప్తు కొనసాగుతోందని, తుది నివేదికలో పూర్తి వివరాలు వెల్లడవుతాయని మంత్రి అన్నారు. సోమవారం ప్రారంభమైన వర్షాకాల లోక్‌సభ సమావేశఃలో లో ప్రతిపక్షాలు కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీయగా, పౌర విమానయాన శాఖ మంత్రి స్పందించారు.

అందుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. మొదటి దశ దర్యాప్తు ఇప్పటికే పూర్తయిందన్నారు . ఈ దశలో ప్రాథమిక నివేదికను ఇప్పటికే దర్యాప్తు సంస్థ విడుదల చేసిన విషయాన్ని గుర్తు చేశారు. . విమానంలోని బ్లాక్ బాక్స్‌కు కొంత నష్టం జరిగిందని, సాధారణంగా, బ్లాక్ బాక్స్‌కు నష్టం జరిగినప్పుడు దానిని విశ్లేషణ కోసం తయారీదారుకు పంపడం ఆనవాయితీ అని చెప్పారు%ా% అయితే, ఈ సారి భారతదేశంలోనే మొదటిసారిగా బ్లాక్ బాక్స్ డీకోడింగ్ ప్రక్రియ విజయవంతంగా జరిగిందని మంత్రి రామ్ మోహన్ నాయుడు వెల్లడించారు. ఇది భారతదేశ పౌర విమానయాన రంగంలో ఒక ముఖ్యమైన విజయంగా ఆయన అభివర్ణించారు.

కావాలనే తప్పుడు కథనాలు..

దర్యాప్తు ప్రక్రియలో ఎయిర్‌క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బోర్డ్ నిష్పాక్షికతను మంత్రి సమర్థించారు. కొన్ని విదేశీ మీడియా సంస్థలు ఈ ప్రమాదంపై తమ సొంత కథనాలను రూపొందించి తప్పుడు ప్రచారం చేస్తున్నాయన్నారు. అలాంటి కథనాలను తాను గమనించానని, వాటిని నమ్మొద్దన్నారు. ఈ సందర్భంగా, ఎయిర్ ఇండియా లేదా బోయింగ్ వంటి సంస్థలకు మద్దతు ఇవ్వడం కాదని, తమ లక్ష్యం కేవలం సత్యాన్ని వెలికితీసేందుకేనని రామ్మోహన్ నాయుడు స్పష్టం చేశారు. దర్యాప్తు ప్రక్రియను అందరూ గౌరవించాలని, నిజమైన సమాచారం తుది నివేదిక ద్వారా బయటకు వస్తుందని ఆయన వెల్లడించారు.

అంతర్జాతీయ ప్రమాణాలకు కట్టుబాటు

ఇలాంటి విమాన ప్రమాద దర్యాప్తులు అంతర్జాతీయంగా ఒక నిర్దిష్ట ప్రక్రియను అనుసరిస్తాయని మంత్రి వివరించారు. భారతదేశం కూడా ఈ అంతర్జాతీయ ప్రమాణాలకు కట్టుబడి ఉందని, ఈ దర్యాప్తు ఆ దిశగా సాగుతోందని ఆయన పేర్కొన్నారు. ప్రమాద కారణాలను గుర్తించేందుకు సమగ్ర విశ్లేషణ జరుగుతోందని, తుది నివేదికలో అన్ని వివరాలు స్పష్టమవుతాయని ఆయన హామీ ఇచ్చారు.

# సినీ తారలకి నోటీసులు జారీ చేసిన ఈడీ

మొదటి పేజీ తరువాయి

విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం, రానా దగ్గుబాటి జూలై 23న, ప్రకాష్ రాజ్ జూలై 30న, విజయ్ దేవరకొండ ఆగస్టు 6న, మంచు లక్ష్మీ ఆగస్టు 13న ఈడీ విచారణకు హాజరు కావాల్సి ఉంటుంది. ఇల్లీగల్ ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌ల ప్రమోషన్‌కు సంబంధించి ఈ యాప్‌లతో ఎలాంటి సంబంధం కలిగి ఉన్నారనే విషయంపై ఈడీ లోతైన విచారణ జరుపుతోంది. మరిన్ని వివరాల కోసం ఈడీ ఈ నటులను ప్రశ్నించనుంది. ఈ విషయంపై సినీ పరిశ్రమలో చర్చలు జోరందుకున్నాయి. తదుపరి విచారణలో ఏ విధమైన వివరాలు బయటపడతాయనేది ఆసక్తికరంగా మారింది.



# హెచ్‌సీఏ స్కామ్‌పై సీఐడీ విచారణలో వెలుగులోకి సంచలనాలు!

మొదటి పేజీ తరువాయి

హెచ్‌సీఏ ఎన్నికల సమయంలో జగన్మోహన్ రావు 23 ఇన్‌స్టిట్యూషన్స్ ఓట్లను అక్రమంగా వేయించుకున్నట్లు సీఐడీ అధికారులు గుర్తించారు. ఇన్‌స్టిట్యూషన్స్ తరఫున ప్రతినిధులను ఓటింగ్‌కు అర్హులుగా కమిషన్ చేసింది. నిజమైన ఓటర్లకు బదులు ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు ఓట్లు వేసినట్టు సీఐడీ గుర్తించింది. గత హెచ్‌సీఏ ఎన్నికల్లో ఎవరెవరు ఓట్లు వేశారో వారిని విచారించేందుకు సీఐడీ రంగం సిద్ధం చేసింది. 23 ఇన్‌స్టిట్యూషన్స్ ఓట్ల వల్లనే జగన్మోహన్ గెలిచినట్లు గుర్తించింది. ఎవరి ఒత్తిడితో ఓట్లు వేశారు అనే కోణంలో సీఐడీ విచారణ జరుపుతోంది.

ఉప్పల్ స్టేడియంలో స్వాధీనం చేసుకున్న రికార్డ్స్‌ను సీఐడీ వెరిఫై చేస్తోంది. క్యాటరింగ్‌కు ఎలాంటి టెండర్లు లేకుండానే తమ అనుకూల సంస్థకు కేటాయించినట్టు గుర్తించింది. ఒక్కో ప్లేట్‌పై 2 వేల రూపాయలు బిల్ వేసి.. వాటికి హెచ్‌సీఏ నిధులు చెల్లించినట్టు ఆధారాలు సేకరించారు. 2024లో చెల్లించిన పవర్ బిల్స్ సైతం సీఐడీ చెక్ చేస్తోంది. పెండింగ్‌లో ఉన్న పవర్ బిల్ చెల్లించలేదని గతంలో మ్యాచ్ సమయంలో స్టేడియం విద్యుత్ సరఫరాను అధికారులు నిలిపివేశారు. వీటితో పాటు నిందితుల ఇళ్లలో సీఐడీ సోదాలు నిర్వహించింది. రేపు నిందితులను కోర్టులో సీఐడీ హాజరుపర్చనుంది.

# ఆర్టీఐలో బీసీలు ఎస్సిలకు చోటు లేదా .?



**న్యూస్ డెస్క్, 21 జూలై (కెరటం న్యూస్):** ఇటీవల కాలంలో తెలంగాణ జాగృతి తరపున ఎమ్మెల్సీ కవిత కీలక పోరాటాలు చేస్తూ తరచూ వార్తల్లో నిలుస్తున్నారు. అధికార కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలతో పాటు సొంతపార్టీ బీఆర్ఎస్ తీరుగా బహిరంగంగా ఎండగడుతున్నారు. తాజాగా ఎక్స్ వేదికగా సమాచార హక్కు చట్టం కమిషన్ లో కమిషనర్ల నియాకంలో ప్రభుత్వ వైఖరిని విమర్శిస్తూ విమర్శల బాణం ఎక్కుపెట్టారు. సమాచార హక్కు చట్టం కమిషన్‌లో బీసీలు, ఎస్టీలకు చోటు ఇవ్వరా అని ప్రశ్నిస్తూ ట్వీట్ చేశారు.

ఎమ్మెల్సీ కవిత ఎక్స్ లో చేసిన పోస్టులో, 'సమాచార హక్కు చట్టం కమిషన్ లో బీసీలు, ఎస్టీలకు చోటు లేదా? ఇప్పటికే నియమించిన చీఫ్ కమిషనర్, నలుగురు కమిషనర్ లలో ఒక్కరు కూడా, ఎస్టీ, బీసీలు లేరు. మరో ముగ్గురు కమిషనర్ల నియామకాలకు రూపొందించిన ప్రతిపాదనల్లోనూ బీసీలు, ఎస్టీలకు ఛాన్స్ ఇవ్వలేదని తెలుస్తోంది. జనాభా దామాషా ప్రకారం పెండింగ్ లో ఉన్న మూడు కమిషనర్ పోస్టులను బీసీలు, ఎస్టీలతో భర్తీ చేయాలని డిమాండ్ చేస్తున్నాను. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లపై కాంగ్రెస్ ప్రభుత్వానికి ఎంత చిత్తశుద్ధి ఉన్నదో ఈ చర్యలే రూఢీ చేస్తున్నాయి.' అని ట్వీట్ చేశారు.

# 28న జరిగే చలో కలెక్టరేట్ ను జయప్రదం చేయండి

**జూలై 28న జాతీయ సంఘం కన్వీనర్ డాక్టర్ వివేక్ హాజరు**

**ఫీజులు చెల్లించకపోతే ప్రభుత్వాన్ని అడుగడుగునా నిలదీస్తాం**

**జూలై 28 చలో కలెక్టరేట్ గోడపత్రిక ఆవిష్కరణ**

**డిఎస్ఎఫ్ఐ, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కమిటీ**





**కొత్తగూడెం,21 జూలై (కెరటం న్యూస్):** భారత ప్రజాతంత్ర విద్యార్థి సమాఖ్య (డిఎస్ఎఫ్ఐ), భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పాల్వంచ స్థానిక ప్రెస్ క్లబ్ లో మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డిఎస్ఎఫ్ఐ రాష్ట్ర నాయకులు బి.వీరభద్రం, కేళోత్ సాయికుమార్, గుగులోత్ సూర్యప్రకాష్ మాట్లాడుతూ.. జూలై 28న భద్రాద్రి కొత్తగూడెంలో చలో కలెక్టరేట్ కు పిలుపునిస్తున్నట్లు తెలిపారు. 28న జరిగే చలో కలెక్టరేట్ సంఘం జాతీయ కన్వీనర్ డాక్టర్ వివేక్ హాజరుకానున్నట్లు తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో 8600 కోట్ల రూపాయల స్కాలర్షిప్స్, ఫీజు రియంబర్స్మెంట్ పెండింగ్లో ఉన్నాయని, ప్రైవేట్ కళాశాలలో ట్యూషన్ ఫీజులు చెల్లించలేక విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు తీవ్రమైన సమస్యలు ఎదుర్కొంటున్నారని, బడ్జెట్ ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు తీవ్రమైన అప్పుల ఊబిలో కూరుకు పోయారని, ఫైనాన్స్ కంపెనీల దగ్గర వడ్డీలు తీసుకొని తిరిగి కట్టలేని పరిస్థితుల్లో యాజమాన్యాలు ఉన్నాయని అన్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం 3 సంవత్సరాల కాలంగా రీయంబర్స్మెంట్ చెల్లించలేదని, విద్యారంగాన్ని తీవ్ర నిర్లక్ష్యం చేసిందని, రియంబర్స్మెంట్ పథకాన్ని నీరుగార్చిందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం కూడా తిరిగి అదే విధానాలు అవలంబిస్తున్నట్లు తెలిపారు. సంక్షేమ వసతి గృహాల్లో చదువుకునే విద్యార్థులకు గత 5 నెలల కాలంగా డైట్ బిల్లులు చెల్లించట్లేదు అని, ప్రతి నెల డేట్ బిల్ చెల్లించాలని కోరారు. గత ప్రభుత్వం ఆర్భాటంగా ప్రారంభించిన మన ఊరు–మన బడి పథకానికి ఇంతవరకు కాంట్రాక్టర్లకు బిల్లులు కూడా చెల్లించకపోవడంతో కాంగ్రెస్ హయాంలో రోడ్డెక్కాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కొరవడినాయని, ఇంటర్మీడియట్ విద్యార్థులకు పూర్తిస్థాయిలో పాఠ్యపుస్తకాలు అందించాలని, ప్రైవేట్ కళాశాలల్లో చదువుకునే విద్యార్థులకు కూడా తెలుగు అకాడమీ పుస్తకాలు ఉచితంగా అందించాలని కోరారు. ఇంటర్మీడియట్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం అమలు చేయాలని, బెస్ట్ అవైలబుల్ స్కీమ్ నిధులు తక్షణమే విడుదల చేయాలని, విద్యార్థినీ విద్యార్థులకు ఉచిత బస్సు పాస్ లు ఇవ్వాలని, ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలలో మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. కేజీ బీవీలలో విద్యార్థులు సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ సమస్యల పరిష్కారానికై జూలై 28న చలో కలెక్టరేట్ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. కెఎస్ మ్ ఇంజనీరింగ్ కళాశాల మైదానం నుంచి కలెక్టరేట్ వరకు భారీ ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు వేలాదిగా హాజరై జయప్రదం చేయాలని కోరారు. అనంతరం జూలై 28 చలో కలెక్టరేట్ గోడపత్రిక ఆవిష్కరించారు. ఉపాధ్యాయులు, అధ్యాపకులు, మేధావి వర్గం, అభ్యుదయ వాదులు కార్యక్రమానికి మద్దతు తెలపాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇన్ చార్జి సిహెచ్ రామ్ చరణ్,నరేష్, యాకూబ్, అజయ్, సునీల్ , వినయ్, వరుణ్, ఆకాష్, ప్రసన్న, కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

# మహిళా రిజర్వేషన్ చట్టాన్ని సవరించాలి

**శరతులను తొలగించి మహిళా రిజర్వేషన్లు అమలు చేయాలి**

**మహిళా చట్టాల పట్ల పూర్తి అవగాహన కలిగి ఉండాలి**

**మహిళలపై జరుగుతున్న దాడులు అరికట్టడానికి కఠినమైన చట్టాలు రూపొందించాలి**

**మహిళా సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి నున్న లక్ష్మీ కుమారి**




**కొత్తగూడెం,21 జూలై (కెరటం న్యూస్):** చట్టసభల్లో మహిళా రిజర్వేషన్ చట్టం 2023ను సవరించాలినీ మహిళా సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి నున్న లక్ష్మి కుమారి కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక చంద్ర రాజేశ్వరరావు భవన్ లో పాల్వంచ మండల, పట్టణ భారత జాతీయ మహిళా సమాఖ్య(ఎన్.ఎఫ్.ఐ.డబ్ల్యూ) 5వ మహాసభ జరిగింది. తొలుత మహాసభ ప్రారంభ సూచికగా జిల్లా అధ్యక్షురాలు కమటం చంద్రకళ అరుణ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం జరిగిన మహా సభకు ముఖ్య అతిథిగా హాజరైన లక్ష్మి కుమారి మాట్లాడుతూ.. మహిళా రిజర్వేషన్ బిల్లును చట్టం చేయడంలో క్షమించరాన్ని జాప్యం చేసిన కేంద్ర పాలకులకు వ్యతిరేకంగా భారత జాతీయ మహిళా సమాఖ్య 2021 వ సంవత్సరం సుప్రీం కోర్టులో కేసు వేయడం జరిగిందినీ, కోర్టుకు సమాధానం చెప్పడానికి పాలకులకు రెండు సంవత్సరాలు పట్టిందినీ విమర్శించారు. మహిళలకు చట్టసభల్లో రిజర్వేషన్ అమలు చేయాలంటే చట్టంలో రెండు షరతులు కేంద్ర ప్రభుత్వం విధించింది ఒకటి జనగణన రెండు నియోజకవర్గాల పునర్వి భజన చేసిన తరవాత టెర్మిషన్ చట్టం అమలు చేస్తామని చెప్పిందినీ, కానీ ఈ అంశాలకు చట్టానికి సంబంధం ఏమిటినీ ప్రశ్నించారు. తక్షణమే షరతులు లేకుండా మహిళా రిజర్వేషన్ బిల్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. అమలు చేయకపోతే మహిళా లోకం తిరుగుబాటు తప్పదని కేంద్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ప్రపంచ దేశాల్లో ఆనాడు మహిళల పరిస్థితులు ఎంతో దయనీయంగా ఉన్న పరిస్థితుల్లో మహిళా హక్కులకై, ఎనిమిది గంటల పని దినాలకై, ఓటు హక్కుకై, పని ప్రదేశాలలో మౌలిక సదుపాయాలకోసం, కనీస వేతనాల కోసం ఆనాడు మహిళా నాయకురాలు క్లారా జెట్ కిన్, రోజా లగ్జం బర్గ్, అలెగ్జాండ్రా కొల్లంతాయ్, కృప స్కయా లాంటి 50 దేశాల కమ్యూనిస్టు నాయకురాళ్లు ఎన్నో త్యాగాలు చేసి మహిళా హక్కుల సాధించారన్నారు. ఇప్పటికీ మహిళలు రెండవ తరగతి పౌరురాలుగా మన దేశంలో ఉనారుని, మహిళా సాధికారత అని చెప్పున్న ప్రభుత్వాలు మహిళలకి బడ్జెట్లో నిధులు కేటాయింపుల్లో వివక్ష చూపడం జరుగుతు%శీ%దని విమర్శించారు. 33శాతం రిజర్వేషన్ కల్పిస్తామని చెప్పి దాన్ని 2026 అమలు చేస్తావని మాయమాటలు చెబుతున్నటువంటి దుర్మార్గ కేంద్ర ప్రభుత్వ విధానాల్ని ఎండగట్టాలని అన్నారు. మణిపూర్ లాంటి ఘటనలు మహిళలపైన హింస, అత్యాచారాలు, హత్యలు నేపథ్యంగా పరిపాలన కొనసాగుతా ఉందని అన్నారు, మనుధర్మ భావజాలాన్ని ప్రచారం చేస్తున్నటువంటి ప్రభుత్వాల నీడలో మహిళలకు రక్షణ లేదని సోషలిజం సాధించినప్పుడే నిజమైన మహిళా విముక్తి కలుగుతుందని అన్నారు. శ్రామిక మహిళలుకి చాలీచాలని వేతనాలతో గౌరవ వేతనాల పేరుతో శ్రమదోపిడికి గురవుతున్నారని, శ్రామిక మహిళలకి కనీస వేతనాలు 26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. గ్రామాల్లోని పేద మహిళలు ఉపాధి పనుల కోసం వందల మైళ్ళు వలస వెళ్లి పని చేసుకోవాల్సిన దౌర్భాగ్యం పరిస్థితి నేటికి కొనసాగుతుందని ఉపాధి పని చేస్తున్నటువంటి పేదలకు వేతనాలు సరిగా అమలు కాని పరిస్థితి కనీసం రోజుకు 100 రూపాయలు కూడా గిట్టని పరిస్థితిలు ఉన్నాయని, మహిళలకి ఆత్మగౌరవం, సమాన పనికి సమాన వేతనం, వివక్ష లేని సమాజం రావాలంటే మహిళలందరూ ఐక్యంగా పోరాడితే తప్ప సాధించలేమని అన్నారు. శ్రామిక మహిళలు, పేద, మధ్యతరగతి మహిళలు ఐక్యంగా మహిళా హక్కుల కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మహిళా సమాఖ్య. జిల్లా వర్కింగ్ కమిటీ ప్రెసిడెంట్ వీసంశెట్టి పద్మజ, జిల్లా సహాయ కార్యదర్శి మామిడాల ధనలక్ష్మి, మండల పట్టణ మహిళా సంఘం నాయకురాలు గాలి పద్మ, చర్ప లక్ష్మి, వాడే లక్ష్మి, కోరం స్వర్ణలత, ధరమ్ సోత్ అరుణ, వగ్గేల పద్మ, దాసరి లక్ష్మి కుమారి, శివ పార్వతి, కమటం ఈశ్వరమ్మ, గడల తిరుపతమ్మ, మాలోత్ పద్మ తదితరులు పాల్గొన్నారు.





# విద్యార్థుల తల్లిదండ్రులను వేధింపులు

**నీట్ కోచింగ్ సెంటర్లపై చర్యలు తీసుకోవాలి**

**జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖాధికారి స్పందించాలి**

**డిఎస్ఎఫ్ఐ**



**ఖమ్మం,21 జూలై (కెరటం న్యూస్):** పట్టణంలోని ఎటువంటి అనుమతులు లేకుండా నీట్ కోచింగ్ పేరుతో లక్షల రూపాయల ఫీజులు దండుకుంటున్న కోచింగ్ సెంటర్లపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిఎస్ఎఫ్ఐ రాష్ట్ర నాయకులు బి. వీరభద్రం డిమాండ్ చేసారు. నిబంధనలకు విరుద్ధంగా ఇంటర్ బోర్డు నిబంధనలు తుంగలో తొక్కి, ఇతర కళాశాలల పేరుతో అడ్మిషన్లు చేసి ఇంటర్మీడియట్ తరగతులు కోచింగ్ సెంటర్లలో నిర్వహిస్తున్నారు. ఇది బోర్డు నిబంధనలకు పూర్తి విరుద్ధమైనది. ఇటువంటి కోచింగ్ సెంటర్లపై ఎటువంటి చర్యలు తీసుకోకుండా జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖాధికారి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. లాంగ్ టర్మ్ , షార్ట్ టర్మ్, క్రాష్ కోర్స్, లియో, నీట్ 20 స్పెషల్ ఫోకస్ బ్యాచ్ పేరుతో, టాప్ మార్కులు, ర్యాంకుల పేరుతో తల్లిదండ్రులను ప్రైవేట్, కార్పోరేట్ మాయాజాలంలోకి దింపి లక్షల రూపాయలు వసూళ్ళు చేస్తున్నారు. ఖమ్మం పట్టణంలో శ్రీచైతన్య, నారాయణ, డాక్టర్స్ మెడికల్ అకాడమీ, ఎలైట్ మెడికల్ అకాడమీ, ఆకాష్, శ్రీ వైవిధ్య మెడికల్ అకాడమీ, ప్రజ్ఞ, ఫిజిక్స్ వాలా, పిటిఆర్ ఆర్యభట్ట, రైట్ వే కోచింగ్ సెంటర్లు విద్యార్థుల తల్లిదండ్రులను నిలువు దోపిడి చేస్తున్నాయి. తక్షణమే అక్రమంగా ఎటువంటి అనుమతులు లేకుండా ఇంటర్మీడియట్ తరగతులు నిర్వహిస్తున్న కోచింగ్ సెంటర్లపై జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖాధికారి చర్యలు తీసుకోవాలి. అనుమతులు లేకుండా ఒక్కో విద్యార్థి నుండి 1 లక్షా 50 వేల రూపాయలు వసూళ్ళు చేస్తూ, ప్రైవేట్ హాస్టల్స్ నిర్వహిస్తున్న కోచింగ్ సెంటర్లపై జిల్లా కలెక్టర్ తక్షణమే స్పందించి క్రిమినల్ చర్యలకు ఆదేశించాలని, విద్యార్థుల తల్లిదండ్రులను ఫీజుల దోపిడీ నుండి కాపాడాలని భారత ప్రజాతంత్ర విద్యార్థి సమాఖ్య (డిఎస్ఎఫ్ఐ) ఖమ్మం జిల్లా కమిటీ కోరుతుంది.

# కొత్తగూడెం ఏరియాలో స్ట్రక్చర్ కమిటీ సమావేశం



**కొత్తగూడెం,21 జూలై (కెరటం న్యూస్):** కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్ నందు గుర్తింపు, ప్రాతినిధ్య సంఘం సభ్యులతో స్ట్రక్చర్ కమిటీ సమావేశాలు వేరు వేరు ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సమావేశంలో కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ ఎం. షాలేం రాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గుర్తింపు, ప్రాతినిధ్య సంఘం స్ట్రక్చర్ కమిటీ సభ్యులు అందజేసిన డిమాండ్లను జిఎం కమిటీ సమావేశంలో హాజరైన సంబంధిత అధికారులతో చర్చించి వారి డిమాండ్ల అమలుకు సాధ్య సాధ్యలను పరిశీలించి ఏరియా పరిధిలో పరిష్కరించదగిన డిమాండ్లను వీలైనంత తొందరగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశించడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిఎంతో పాటు గుర్తింపు సంఘం ఏఐటీయూసీతో ఏర్పాటు చేసిన స్ట్రక్చర్ కమిటీ నందు కొత్తగూడెం ఏరియా అసిస్టెంట్ బ్రాంచ్ సెక్రటరీ జె గట్టయ్య, సత్తుపల్లి ఏరియా ప్రతినిధి సముద్రాల సుధాకర్, స్ట్రక్చర్ కమిటీ మెంబర్ ఉమాయిన్ పాల్గొన్నారు. ప్రాతినిధ్య సంఘం ఐఎన్టియుసి స్ట్రక్చర్ కమిటీ నందు వైస్ ప్రెసిడెంట్ ఎండి రజాక్, బ్రాంచ్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ టి. నాగరాజు, స్ట్రక్చర్ కమిటీ మెంబర్ జి. సీత రామరాజు పాల్గొన్నారు. యాజమాన్య ప్రతినిధులుగా ఎస్ఓటు జిఎం జివి.కోటిరెడ్డి, డిజిఎం(పర్సనల్) జి.వి. మోహన్ రావు, జీకే ఓసి ప్రాజెక్ట్ ఆఫీసర్ ఎం.శ్రీ రమేష్, జెవిఆర్ ఓసి ప్రాజెక్ట్ ఆఫీసర్ ఎన్.వి.ఆర్ ప్రహ్లాద్, కిష్టారం ఓసి ప్రాజెక్ట్ ఆఫీసర్ ఎం.వీ. నరసింహారావు, డిజిఎం (ఐఈడి) ఎన్. యోహన్, డిజిఎం (ఈ అండ్ ఎం) ఏరియా వర్క్ షాప్ టి శ్రీకాంత్, ఏరియా స్టోర్స్ ఇంచార్జ్ లక్షణమూర్తి, ఇంచార్జ్ ఆర్.సి. హెచ్.పి ఎస్.కే.కరీముల్లా, డివైఎస్ఈ (సివిల్) అచ్యుత రామయ్య, మెడికల్ సూపర్డెంట్ ఎం.పరశు రాములు, ఏరియా స్టేట్స్ ఆఫీసర్ బి.తౌరియా, డివైపిఎం (పర్సనల్) గోవర్ధన హరీష్, సీనియర్ పిఓలు కె. దేవదాస్, అధికారులు డి కావ్య, కే.శ్రీనివాస్ పాల్గొన్నారు.

# మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు

**ట్రాఫిక్ ఎస్ఐ నరేష్ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి స్పెషల్ డ్రైవ్**



**కొత్తగూడెం,21 జూలై (కెరటం న్యూస్):** మద్యం సేవించి వాహనం నడిపేటప్పుడు ఒక్క క్షణం మీ కుటుంబాన్ని గుర్తు చేసుకోండి అంటూ కొత్తగూడెం ట్రాఫిక్ ఎస్ఐ నరేష్ వాహనదారులకు అవగాహన కల్పిస్తున్నారు. స్పెషల్ డ్రైవ్ లో భాగంగా ఆదివారం రాత్రి డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించారు. వాహనదారులు మద్యం సేవించారా లేదా అని బ్రీత్ అనలైజర్ ల ద్వారా పరీక్షించి మద్యం సేవించి వాహనాలు నడుపుతున్నట్లు నిర్ధారణ అయినవారికి అవగాహన కల్పిస్తున్నారు ఇంటి నుంచి బయటికి వచ్చినవారు మరల ఇంటికి వెళ్లేంతవరకు మీ భార్య పిల్లలు మీ కొరకే ఎదురు చూస్తూ ఉంటారని వారి గురించి కూడా ఆలోచించాల్సిన బాధ్యత ఉందని అన్నారు. అతిగా మద్యం సేవించి వాహనం నడపడం వల్ల ఏదైనా అనుకొని సంఘటనలు జరిగితే మీ కుటుంబం రోడ్డు పాలయ్యే ప్రమాదం ఉందని అన్ని విషయాలను ఆలోచించి మద్యం సేవించి వాహనాలు నడపకూడదని చెప్పారు.

# ఘనంగా బస్తీ స్పోర్ట్స్ అకాడమీ తొలి టోర్నమెంట్




**మేడ్చల్ , 21 జూలై (కెరటం న్యూస్):** బస్తీ ప్రాంతాల బాలల మానసిక, శారీరక అభివృద్ధికి సహకరించే లక్ష్యంతో స్థాపించిన హైదరాబాద్ బస్తీ స్పోర్ట్స్ అకాడమీ తమ తొలి టోర్నమెంట్‌ను ఘనంగా నిర్వహించింది. ఈ టోర్నమెంట్‌ను పోచారం మున్సిపాలిటీ పరిధిలోని చౌదరిగూడా జోడిమెట్లలోని శ్రీ సాయి వాణి గ్రామర్ హై స్కూల్‌లో ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో బస్తీ లలో నుంచి వచ్చిన 36 కేంద్రాల పిల్లలతో పాటు మొత్తం 600 మంది పైగా విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. చెడు అలవాట్ల నుంచి పిల్లలను దూరంగా ఉంచుతూ, క్రీడలవైపు దృష్టి మళ్లించేందుకు, వారి మానసిక, శారీరక శక్తిని పెంపొందించేందుకు ఈ అకాడమీ ప్రారంభించబడినట్టు సంస్థ అధ్యక్షుడు నరేంద్ర తెలిపారు. అకాడమీకి పీలడెల్ఫియా తెలంగాణ అసోసియేషన్‌కు చెందిన రవి ప్రకాష్ మెరెడ్డి ముఖ్యమైన స్ఫూర్తి శక్తిగా నిలిచారని, ఆయన ఆధ్వర్యంలో ఎక్స్‌ట్రా మైల్ ఫౌండేషన్, జన ప్రగతి సేవా చారిటబుల్ ట్రస్ట్‌ల సహకారంతో ఈ కార్యక్రమం ముందుకు సాగుతోందని జనరల్ సెక్రటరీ మల్లేశ్ పేర్కొన్నారు. కరోనా తర్వాత యువతలో సోషల్ మీడియా, డ్రగ్స్ వంటి చెడు అలవాట్ల ప్రభావం పెరుగుతుండటాన్ని గమనించిన రవి ప్రకాష్ , ఆటల ద్వారా వారిని సానుకూల మార్గానికి నడిపించాలనే ఆలోచనతో. కొద్ది మంది వ్యాయామ ఉపాధ్యాయులతో కలిసి మొదట ఒక్క కేంద్రంతో ప్రారంభమైన ఈ అకాడమీ, ప్రస్తుతం 25%-%30 కేంద్రాల వరకు విస్తరించింది. ఈ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ టోర్నమెంట్ ద్వారా ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలతో పాటు వివిధ బస్తీ కేంద్రాల్లోని విద్యార్థుల ప్రతిభను వెలికి తీసే ప్రయత్నం జరిగింది. ఈ టోర్నీకి తిరుమలరెడ్డి , మల్లేశం వంటి ప్రముఖుల సహకారం లభించింది.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వందేమాతరం మాధవరెడ్డి, నాగమోహన్, సురేష్ గుప్తా, తీన్మార్ మల్లన్న మమత, అంజన్ రెడ్డి, భోజిరెడ్డి, కొండల్ రెడ్డి, జగన్మోహన్ రెడ్డి, నర్సింగ్ రావు, సుధాకర్ తదితరులు విచ్చేసి విద్యార్థులను ప్రోత్సహించి,రవి ప్రకాష్ మెరెడ్డి ఆలోచన ఎంతో గొప్పదని వారు పేర్కొంటూ, యువతలో శారీరకంగా, మానసికంగా బలమైన వ్యక్తులుగా ఎదిగేలా క్రీడలు ఎంతగానో సహాయపడతాయని అభిప్రాయపడ్డారు.



ఈ టోర్నీలో రాజా, శేఖర్, నరేంద్రబాబు, బాలకృష్ణ, నగేష్, రాకేష్, వెంకటేష్, రమేష్, బొట్ల సరిత, రవి తదితర వ్యాయామ ఉపాధ్యాయులు క్రీడాకారులు విద్యార్థులు పాల్గొన్నారు.

# సచిన్ పక్కన నా పేరా?.. అండర్సన్ కీలక వ్యాఖ్యలు!



స్పోర్ట్స్ న్యూస్ ,21 జూలై (కెరటం న్యూస్): ఇంగ్లీష్ గడ్డపై ఇంగ్లండ్-భారత్ టెస్టు సిరీస్ విజేతకు ఇచ్చే ట్రోఫీకి 'పటౌడీ సిరీస్' అనే పేరు ఉండేది. ఇటీవలే పటౌడీ పేరును ఇంగ్లండ్ బోర్డు రిటైర్ చేసి.. 'అండర్సన్-టెండూల్కర్' ట్రోఫీగా మార్చింది. భారత్‌లో తలపడితే 'ఆంథోని డి మెల్లో' ట్రోఫీని ఇచ్చేవారు. ఇక భారత్‌లో ఆడినా, ఇంగ్లండ్‌లో తలపడినా.. రెండు జట్ల మధ్య సిరీస్ విజేతకు అండర్సన్-టెండూల్కర్ ట్రోఫీ ఇవ్వనున్నారు. విజేత జట్టు కెప్టెన్‌కు 'పటౌడీ మెడల్'ను అందిస్తారు. ట్రోఫీ పేరు మార్పుపై ఇంగ్లండ్ మాజీ పేసర్ జేమ్స్ అండర్సన్ స్పందించాడు. దిగ్గజం సచిన్ టెండూల్కర్ పేరు పక్కన తన పేరా అని అనిపిస్తోందని తెలిపాడు.

'ఓ ట్రోఫీకి మన పేరు పెట్టడం పెద్ద విషయం. సచిన్ టెండూల్కర్ లాంటి దిగ్గజ ఆటగాడి పక్కన నా పేరు ఉండడం ఇంకా పెద్ద మ్యాటర్. సచిన్ పక్కన నా పేరా? అని ఇంకా నమ్మబుద్ధి కావట్లేదు. సచిన్‌తో కలిసి ట్రోఫీని ఆవిష్కరించడం సంతోషంగా అనిపించింది. నా చిన్నప్పటి నుంచి సచిన్ ఆట చూశాను. ప్రత్యర్థిగా కూడా తలపడ్డాను. వికెట్ కూడా పడగొట్టాను. ఒక దేశ భారాన్ని తన కెరీర్ ఆసాంతం భుజస్కంధాలపై మోస్తూ రాణించిన గొప్ప ఆటగాడు సచిన్. సచిన్‌తో కలిసి ట్రోఫీలో భాగం కావడం పెద్ద గౌరవంగా భావిస్తున్నా' అని జేమ్స్ అండర్సన్ చెప్పాడు.సచిన్ టెండూల్కర్ **200** టెస్టులు ఆడి **15921** పరుగులు చేశాడు. **51** సెంచరీలు బాదాడు. టెస్ట్ ఫార్మాట్లో అత్యధిక పరుగులతో పాటు అత్యధిక సెంచరీల రికార్డు సచిన్ సొంతం. మరోవైపు **188** టెస్టులు ఆడిన జేమ్స్ అండర్సన్ **704** వికెట్లు పడగొట్టాడు. అత్యధిక వికెట్లు తీసిన బౌలర్ల జాబితాలో అండర్సన్ మూడో స్థానంలో ఉన్నాడు. టెస్ట్ ఫార్మాట్లో అత్యధిక వికెట్స్ తీసిన పేసర్ అండర్సనే. మాజీ స్పిన్నర్లు మురళీధరన్ **(800)**, షేన్ వార్న్ **(709)** అండర్సన్ కంటే ముందున్నారు.

# నా కెరీర్‌లో గొప్ప విషయమిది



**మూవీ న్యూస్, 21 జూలై (కెరటం న్యూస్):** "సినీరంగంలోకి వచ్చిన తక్కువ సమయంలోనే అద్భుతమైన దర్శకుల సినిమాల్లో నటించే అవకాశం రావడం నా కెరీర్‌లోనే గొప్ప విషయం. భాషతో సంబంధం లేకుండా వేర్వేరు నటులతో కలిసి పనిచేయడం మంచి అనుభవం. వారందరి నుంచి ఎన్నో కొత్త విషయాలు నేర్చుకోవచ్చు. అవి కెరీర్‌కు ఎంతో ఉపయోగపడతాయి. ప్రస్తుతం నేను.. షాహిద్ కపూర్ హీరోగా విశాల్ భరద్వాజ్ దర్శకత్వంలో రూపొందుతున్న ఓ సినిమాలో నటిస్తున్నా. దీంతో పాటు సందీప్ రెడ్డి వంగా తెరకెక్కిస్తున్న 'స్పిరిట్'లో కీలక పాత్ర పోషిస్తున్నా. దీన్ని భారీ స్థాయిలో తీర్చిదిద్దుతోంది చిత్రబృందం. ఈ సినిమా కోసం చాలా ఉత్సాహంగా ఎదురుచూస్తున్నని ప్రస్తుతం నటీనటులు కంటెంట్ బాగుంటే.. పాత్రతో సంబంధం లేకుండా నటిస్తున్నారు. నేను కూడా అంతే. నెగిటివ్ పాత్రలు పోషించడానికైనా సిద్ధమే. అప్పట్లో నెగిటివ్ పాత్రలను విలన్లుగా పరిగణించేవారు. కానీ ప్రస్తుతం వీటిని ఎవరైనా పోషించవచ్చు. ఇలాంటి భూమికల్లో ఒదిగిపోవడం సవాలే. కానీ కష్టమైనా కొత్తగా ఏదైనా నేర్చుకోవడానికే ఇష్టపడతా"అని త్రిప్తి డిమ్రి అన్నారు.

# ఆమె నటించిన పాత్రల్లో మరొకర్ని ఊహించుకోలేం!



**మూవీ న్యూస్, 21 జూలై (కెరటం న్యూస్):** విలక్షణ నటుడు విజయ్ సేతుపతి, అందాల తార నిత్యామేనన్ జంటగా 'తలైవాన్ తలైవి' చిత్రంలో నటిస్తున్న సంగతి తెలిసిందే. పాండిరాజ్ దర్శకత్వం వహిస్తున్నారు. ఇందులో పరోటా మాస్టర్‌గా విజయ్, అతని భార్యగా నిత్య సందడి చేయనున్నారు. ఈ సినిమా ఈ నెల 25న రానుంది. ఈ సందర్భంగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న విజయ్.. నిత్యతో పనిచేయడం గురించి మాట్లాడారు. "ఒక అద్భుతమైన నటి నిత్య. ఆమె ఎంచుకున్న ప్రతీ పాత్రలోనూ ప్రాణం పెట్టి నటిస్తుంటుంది. ఇప్పటి వరకు ఆమె పోషించిన పాత్రల్లో మరొకర్ని ఊహించుకోలేం. ఇంతకు ముందు మలయాళ చిత్రం '19(1)(ఏ)లో మేమిద్దరం కలిసి నటించాం. ఈ 'తలైవాన్ తలైవి' కథ మా దగ్గరకు వచ్చినప్పుడు.. మేము మరోసారి జోడీగా సందడి చేయడానికి ఇదే సరైన కథ అనిపించింది. నిత్యతో స్క్రీన్‌ను పంచుకోవడం మంచి అనుభవమ"ని అన్నారు.